# ఆఖరి అడుగు



**గిన్నెలో** బియ్యం కుతకుత లాడుతున్నది. పాలనురగలాటి పొంగు గిన్నె అంచులను తాకుతున్నది ఆత్రంగా. ఆవిరి బలిమికి మూత టపటప కొట్టుకుంటున్నది. ఉన్నట్లుండి పొయ్యిలో మంట ఆరిపోయింది. మరొక కర్ర తగిల్చి మంటను ఎగసన తోసింది పద్దమ్మ. మంట అందుకొన్నది.

ఆ వెలుగులో ముడుతలుపడ్డ పద్దమ్మ ముఖంలోని ఆశ నిరాశల ఆకారాలు వెలుగు నీడలతో దాగుడుమూత లాడుతున్నాయి. పొయ్యిలోని చిన్నపేడు మంట నందుకొన్నది. పొగచూరిన వంటిల్లంతా ప్రకాశవంతమైంది. పద్దమ్మ ముఖపద్మం వికసించింది.

"ఈ ఒక్క ముద్ద తినమ్మా! మాతల్లివి కావూ." అనురాగ పూరితమైన మాతృమూర్తి లాలింపు.

"ఊహూఁ, నేను తినను. ఎప్పుడూ ఆవకాయ చద్దన్నం; ఎవరు తింటారేం? ఇవాళ పెరుగు పెడ్తానన్నావుగా!" కష్టసుఖాలని చవిచూడని చిన్నారి సతాయింపు.

"అయ్యో, నామతి మండా, మరచేపోయేను. నీకు పెరుగు వేస్తానన్నానుకదూ! చూడమ్మా, సీతాయి, ఆ పత్తు గిన్నెలో పెరుగున్నాది. ఇలా పట్టుకురా, పద్దాలు వేస్తాను."

హృదిలో రగిలే అగ్నిపర్వతాల భుగభుగలను

**ఒక వయసులో కోరికలు ఉండడం సహజం. అప్పుడు సాధ్యాసాధ్యాల ప్రసక్తి ఉండదు. తరువాత జీవితం అంటే ఏమిటో తెలుస్తుంది. అన్ని కోరికలూ అంతరించినా ఆశారేఖ మినుకుమంటూనే ఉంటుంది.**

పెదిమల క్రింద అదిమిపట్టి, హాలాహలంలోంచి అమృతాన్ని అందిద్దామని ఆశపడే తల్లి మనసులోని తపన.

"ఈ గిన్నెలో పెరుగు లేదమ్మా! అసలు పెరుగు పోసిన జాడేలేదు." మానవ జీవితంమీద సత్యాసత్యాల ప్రభావం ఎరుగని అమాయకపు బాలిక జబాబు.

"అయ్యో! గిన్నె నిండా పెరుగు తోడు పెట్టేనే; పాడుపిల్లి తాగిపోయిందిలా వుంది. ఈసారి వస్తే కాలు విరగగొట్టాలి. మాతల్లివి కావూ! ఈ పూటకి తినేయమ్మా; రేపు తప్పకుండా నీకు పెరుగు పెడ్తాను."

పద్దమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ మాగడ పెరుగు తినే రేపు అంత తొందర్లోరాదని ఆనాడు

## ద్వివేదుల విశాలాక్షి

తనకు తెలియదు. ఇన్నేళ్ళు గడిచాక ఈనాడు మాగడ పెరుగు తినాలనే కోరిక తనకి లేదు. ఇంకా ఎన్నో కోరికలు తీయనివి, తీరనివి ఈ వయో రాసి క్రింద భూస్థాపితం చెయ్యబడ్డాయి.

మనసుని మురిపించే, మధువును అందించే కోరికలు ఊహలలోనే పుట్టి, ఊహలలోనే పెరిగి, ఊహలలోనే కలిసిపోయాయి.

అవి తన కనుల ముందు కదలక మునుపే, ఈ భౌతికకాయం ఆ ఆనందానుభూతిని చవి చూడక మునుపే మాయమయాయి. తీయని కోరికలన్నీ అభాగ్యపు అరణ్యంలో చిక్కుకొని గతంలో సమసిపోయాయి.

మిగిలినదల్లా...తను; ఎండకు ఎండి, వానకు తడసి మోడుపడిన వృక్షంలా... పళ్ళను, పువ్వులను అందరికి పంచి ఇచ్చి వట్టిపోయిన చెట్టులా.. ఇంతేనా జీవితం.... ఇందుకేనా బ్రతకాలి....

ఎవరికి మాత్రం ఇంకేముంటుంది? నీకు మాత్రం ఇంకేం కావాలి? అంటారు అంతా. నిజమే. ఈనాడు తనకేం కావాలో తనకే తెలియదు. ప్రపంచ దృష్టిలో తను ఆశించవలసింది, అందుకోవలసింది ఏమీ లేదు.

ఇటుకి దూరం, అటుకి దగ్గర అయిన ఈ *ముసలావిడకి ఇంకా ఏంకావాలంటారు అంతా.* ఈనాడు తనకు ఏమీ కోరికలు లేకపోవచ్చు.

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
చందాదారులకు
విజ్ఞప్తి!
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

కొరకు చందా పంపేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాము:

1 చందా పంపేటప్పుడు మని ఆర్డర్ కూపనులో కాని, ఉత్తరంలో కాని తమకు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక పంపాలని స్పష్టంగా వ్రాయాలి.

2 పాత చందాదారులు తమ చందా సంఖ్య ఉదాహరించాలి.

3 ఎంతకాలం పంపవలసినది స్పష్టంగా వ్రాయాలి.

4 గ్రామం పేరు, పోస్ట్ ఆఫీసు, ఏఊరుమీదుగా పంపవలసినది (అవసరమైన సందర్భాలలో), తాలూకా, జిల్లా మున్నగు వివరాలు అన్నీ స్పష్టంగా వ్రాయాలి.

5. చందా మొత్తం 'మేనేజర్, ఆంధ్రప్రభ లిమిటెడ్ విసెంటురోడ్డు, గాంధీనగర్, విజయవాడ-3' చిరునామాకు పంపాలి.

సాలుచందా రు.15-60న.పై
6 నెలలకు రు. 7-80 న.పై.
3 నెలలకు రు. 3-90 న.పై.

సదా చందాదారుల సహకారం ఆశిస్తున్నాము.

మేనేజరు.



తెల్లమచ్చలకు
ఉచిత వైద్యము

అనేక సంవత్సరముల పరిశోధన ఫలితముగా కనిపెట్టబడిన "సోమరాజీ" ఆయుర్వేద ఔషధము తెల్లమచ్చలను నివారించును. ఒక చిన్న సీసామందు ఉచితముగా పంపబడును. ఇంగ్లీషులో వ్రాయండి.

Bharat Chikitsa Kendra (G)
P.O. Lal Bigha (Gaya)


# ఆఖరి అడుగు

పుట్టిన దగ్గరినుంచి తను ఇలానె ఉందా? మీగడ పెరుగుకోసం అమ్మ దగ్గర అల్లరి చేసినప్పుడు తన వయసు అయిదేళ్ళకు మించి ఉండదు.

అమ్మ.... అమ్మ... ఎంత తీయని పదం; ఎంత కమ్మని గానం; ఏ దశలోనైన, ఏ వయస్సులోనైన అనురాగానికి, ఆనందానికి చిహ్నం.

గిన్నెలో లేని పెరుగును పిల్లి తినేసిందని అమ్మపడిన బాధ అర్థమయేది కాదు ఆరోజుల్లో. ఈనాడు....

పొయ్యికింద మంటంతా ఎప్పుడో ఆరిపోయింది. ఇల్లంతా పొగ కమ్ముకున్నది. పద్దమ్మ పైటకొంగుతో కళ్ళు తుడుచుకొని, మరొక పేడు పొయ్యిలో వేసింది. అగ్నిదేవుడికి వాయుదేవుడు తోడుకాగా మళ్ళీ మంట అందుకొన్నది.

అవి నాన్న యుద్ధానికి పోయిన రోజులు. కొన్ని నెలలు అందరికీ కడుపునిండా తిండికి, వంటినిండా బట్టకు ఏకొరతా ఉండేది కాదు.

ఉన్నట్లుండి నాన్న దగ్గరనుంచి సొమ్ము రావడం మానేసింది. అమ్మ ఆ కంచం, ఈ చెంబు అమ్మి కాలక్షేపం చెయ్యసాగింది. నిద్రలో మెలకువ వచ్చి తనులేస్తే, కళ్లొత్తుకొని నవ్వుతూ జోలపాడి జోగొట్టేది. అంత దుఃఖంలోను, అంత నిర్మలంగా అమ్మ ఎలా నవ్వగల్గేదో తన కీనాటికీ అర్థం కాదు.

అమ్మ పగలు ఏడవగా అంతవరకు ఎప్పుడు చూడలేదు. ఆరోజు అందరిముందు కళ్ళువాచేలా ఏడ్చింది. ఇరుగు పొరుగుల వారు కూడ అమ్మని చూసి కళ్ళు తుడుచుకొన్నారు.

పక్కింటి పిల్లలు చెప్పేవరకు నాన్న ఇంక తిరిగి రాడని తనకు తెలియనేలేదు. అమ్మ ఒళ్లో పడి నాన్నను తలుచుకొని ఆరోజంతా ఏడ్చింది తను.

"నాన్న రాకపోతే నేమమ్మా! నేనున్నాను కదా! నీకన్నీ కొనిపెడ్తాను. మంచి మంచి బొమ్మలు, పువ్వుల పరికిణీ, గళ్ళజుబ్బా.... ఇంకా చాల... చాలా మిఠాయిలు అన్నీ కొంటాగా" అని ఊరడించింది అమ్మ.

అమ్మ చెప్పినవాటిలో ఏ ఒక్కటీ చెయ్యలేకపోయింది. అన్ని కోరికలూ అన్నయ్య పెద్దవాడవడంతో ముడిపెట్టుకొన్నాయి, కొన్నాళ్ళు.

"మరింకేం...అన్నయ్య పెద్దవాడవుతున్నాడా; బుద్ధిగా చదువుకొని పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసవుతాడు. అప్పుడు మంచి ఉద్యోగం దొరుకుతుంది. మనం ఈ పాత ఇల్లు వదిలి, అంచక్కా పెద్ద బంగాళాలోకి వెళ్ళిపోతాము. అక్కడ మంచి పువ్వుల మొక్కలు, పళ్ళచెట్లు ఎంత బాగుంటుందని; అన్నయ్య ఇన్ని రూపాయలు తెచ్చి నీకు, సీతాయికి మంచి మంచి బట్టలు, రిబ్బన్లు, మిఠాయిలు అన్నీ కొంటాడు" అని అమ్మ భవిష్యద్వాణిలా, అంత తియ్యగా, నమ్మకంగా చెబుతూంటే, నిర్మలంగా విని నిండుగా నిద్దరపోయేదాన్ని.

అన్నయ్య పెద్దవాడయాడు. ఉద్యోగమూ అయింది. కాని, మేముండేది పెద్ద బంగళా కాదు. రెండు గదుల పాత ఇల్లు. ఇంటికి ముందుండేవి మురికి కాలువా, చెత్తడబ్బా. అన్నయ్య జీతం నిత్యావసరాలకు సరిపడడం కష్టమయితే, పువ్వుల పరికిణీ, సిల్కు రిబ్బన్ల గురించి ఆలోచించనే అక్కరలేదు.

నీళ్ళ మజ్జిగ పోసి, పెరుగు పిల్లి తినేసిందని అబద్ధమాడవలసిన స్థితి అమ్మకు తప్పింది. కడుపునిండా తిండే గగనమయే దొక్కసారి. ఉన్నదానితో సర్దుకోవాలని తెలుసుకో గలిగిన వయస్సు వచ్చింది.

వదిన రాకతో ఇంట్లో అలజడి ప్రారంభమయింది. వదిన పుట్టింటివారు మాకన్న ధనవంతులు. మా దారిద్ర్యాన్ని భూతద్దంలో పెట్టి చూపుతూ, అందుకు కారకులము "మేమే" అన్నట్లు అక్కయ్యని, నన్ను అసహ్యించుకొనేది వదిన.

అన్నిటితోపాటు అక్కయ్య పెళ్ళిమీద మాటలు పెరిగాయి. వదిన పినతండ్రికి భార్య పోయింది. ఎలిమెంట్రీ స్కూలు టీచరు. ఉన్న ఊళ్లో కొంత పొలం ఉందిట. ఆయన కిద్దామంటారు అన్నయ్యా, వదినా.

"నలభై ఏళ్ళు ఉన్నా పైకి అలా కన్పించ" డంటాడు అన్నయ్య. నల్లగా ఉంటేనేమి? మగాళ్ళకి అందం ఏమిటి? — ఆ స్ఫోటకం రాబట్టి కాని, లేకుంటే అంత నల్లగా ఉండేవాడు కాదం" టుంది వదిన.

"పిల్లల గురించి నీకేమి బెంగ అక్కరలేదమ్మా! వాళ్ళకి మన సీతాలు ఏమీ చెయ్యనక్కరలేదు. పెళ్ళయిన మరునాడే ఆ నలుగురిని తీసుకుపోతానంటున్నాది వాళ్ళ అమ్మమ్మ. గుండెజబ్బుకు మనం ఏం చెయ్యగలం? పదేళ్ళుగా ఆయన ఆ జబ్బుతోనే ఉన్నాడు. భగవంతుడు దయ తలిస్తే మరొక నూరేళ్ళు అలానే ఉంటాడు. ఇంతకన్నా మంచి సంబంధాలు కావాలంటే కట్నాలు పొయ్యాలి" అంటాడు అన్నయ్య.

ఈ హోమాగ్నిలో ఇంధనం కానున్న అక్కయ్య చాటుగా కళ్ళు తుడుచుకొనేది.

పన్నెండేళ్ళ కిందట పోయిన నాన్నని తలుచుకొని కుమిలిపోయేది అమ్మ.

• • •

అక్కయ్య పెళ్ళి చూసింది లగాయతు నాకు తగని భయం పట్టుకుంది. కన్నులు మూసేనంటే, గడ్డాలు నెరసిన, తలలు పండిన తాతయ్యలంతా వచ్చి నాముందు నిల్చేవారు; నేను నీ మగడిని అంటే, నేను నీకోసం పుట్టినవాడి నంటూ. నిద్రలో 'కెవ్వు'మని చావుకేక పెట్టి లేచి కూర్చునేదాన్ని. అమ్మతో చెబితే ఏం లాభం?

"కానున్నది కాకమానదు; నీ నుదుటిరాత ఎలా ఉంటే అలా జరుగుతుంది" అంటుంది.

ఎందుకో చిన్నప్పటినుంచి ఈ రాత, ఖర్మ అంటే ఏదో సరిపడని వాసనకొట్టేది నాకు. కర్మపేరుతో మానవులు చేతులారా బిగించుకొనే ఉరితాళ్ళతో చిక్కి నశించిపోవలసిందేనా? దేవుని పేరుతో, ఖర్మపేరుతో ఇన్ని అన్యాయాలు జరుగుతూంటే నిజంగా దేవుడనేవాడు ఉండే చూస్తూ ఊరుకొన్నాడా?

మానవుల మనస్సులలోని కల్మషానికే అదృష్టం, కర్మ అని పేర్లు పెట్టుకొని, ఆత్మవంచన చేసుకొంటూ కాలం గడపవలసిందేనా?

అన్నయ్య జీతంమీద తీసుకొన్న అప్పుతో వదినకు గొలుసు కొనేబదులు, దానిని వరకట్నంగా ఇస్తే అక్కకి తగిన వరుడు రాకపోవునా?

దాని అదృష్టాని కెవరు కర్తలు అని మొసలి కన్నీళ్లోడ్చిన పెద్దత్త అభిమానించి, తన కొడుక్కి చేసుకొంటే, దాని నుదుటి వ్రాత మారక పోవునా?

"దాని కర్మ అలా ఉండబట్టే వీడెవరికీ మంచి చేద్దామన్న బుద్ధి పుట్టలేదు" అంటుంది అమ్మ.

ఇవన్నీ అర్థంలేని ఆలోచనలంటుంది అమ్మ. నిజమే.... ఈ ఆలోచనల కవధి ఎక్కడ? ఈ మనో విహంగాన్ని వదిలిపెట్టాలంటే అలా గాలిలో పక్షిలా కొడుతూ ఎగురుతూనే ఉంటుంది కాని, భూమి మీద నిలుస్తుందా? దాని గమనం గాలిలో మాత్రమే సాధ్యమని, భూమిమీద కాలు మోపితే, పెనుభూతాల్లా చుట్టుముట్టే నగ్నసత్యాల కోరలలో ఇరుక్కొని, రెక్కలు తెగి, పక్కలు విరిగి నాశనం కావలసిందేనని దానికి తెలియదా? అందుకే అది దివినుండి భువికి దిగి రానంటుంది.

• • •

మహాప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న వారు ఏ పూతికపుల్ల దొరికినా, ఆధారంగా అందు కొంటారు. ఆ పూతిక వారిని ఒడ్డు చేరుస్తుందని కాదు. ఆ సమయం,ఆ ఆశ అలాటివి

చిన్నత్త, బావ రాకతో నాలో అటువంటి ఆశ మొలకెత్తింది. నాన్నపోయేక చిన్నత్త మా ఇంటికి రావడం ఇది మొదటిసారి.

చిన్నత్తను చూసి అన్నయ్య, వదిన మూతిని మూడు వంకలుగా తిప్పారు. పదిరోజుల క్రిందట పెద్దత్త వస్తే, ఆవిడ సపర్యలతో వారికి ఊపిరి సరిపేదికాదు. అదంతా ఆవిడపై మన్న అభిమానం అనుకొనేరు; ఆవిడని వరించిన లక్ష్మి ప్రభావంమాత్రమే.

చిన్నత్తను ఆదరించడాని కేమున్నదని? మామయ్య పోయాక, ఉన్న రెండెకరాల మాగాణి పిల్లల పెళ్ళిళ్ళకని, పిల్లాడి చదువుకని అమ్మి వేశారు.

ఆ కొడుకైనా ప్రయోజకుడై దోచి పోస్తున్నాడా అంటే సాహిత్య సమావేశాలని, సాంస్కృతిక సభలని, అడ్డమైన ఊళ్ళకి తిరిగిరావడం, ఉన్నది కాస్తా ఊడ్చుకుపోవడం. "బియ్యే పాసయిన వాడు, లక్షణంగా ఉద్యోగం చేసుకోక, ఎందు కొచ్చిన కవిత్వం? కూడు పెట్టునా, గుడ్డ పెట్టునా?" అంటాడు అన్నయ్య.

అన్నయ్య దృష్టిలో బావకు బాగుపడే బుద్ధులు లేవు. అక్క పెళ్ళి సమయంలో, బావ ప్రస్తావన వస్తే, నా చెల్లెలికి పెళ్ళి చేయలేక పోతే, పీక నులిపి నూతిలో తోస్తానుకాని, ఆ చవట కిస్తానా?" అన్నాడు ఉక్రోషంగా.

ఆమీదట చేసింది అంతకు తక్కువేంకాదన్న సంగతి స్పష్టమేకదా!

ఒకనాటి రాత్రి భోజనాలయాక అసలు విషయం బయట పడింది. నేను వంట యిల్లు సర్ది వచ్చేసరికి అన్నయ్య కోపంగా అరుస్తున్నాడు. కొంతసేపటికి కాని ఆ కోపం ఎవరిమీదో అర్థం కాలేదు.... తుదకి తేలిన విషయం.. చిన్నత్త బావకి నన్నిమ్మని అడిగిందట.

బంధుత్వాలు ఎడపడిపోవడం తన కిష్టం లేదని, పెద్దదానికిలానే దీనికి పరాయి సంబంధాలు చూస్తారేమో అని ముందుగా వచ్చేనని అన్నాదిట.

అన్నయ్య, అక్కయ్య పెళ్లి ముందు అన్న మాటలే తిరిగి అన్నాడట.

"నాయనా, ఈడు, జోడు సరిగా ఉంటే బాగుంటే తింటారు, లేకుంటే పస్తుంటారు. డబ్బున్న ముసలివానికి బంగారు బొమ్మ లాటి పిల్లనియ్యడం ఏం బాగుంటుంది?" చిన్నత్త నోరు విడిచి అడిగింది.

"పెద్దది, మీ మంచి కోరేది ... దాని మాట కాదనకు" అన్నదిట అమ్మ.

నేను వెళ్లేసరికి అన్నయ్య దండయాత్ర అమ్మమీద సాగుతున్నది.

అన్నయ్య మాట పూర్తి కాకుండానే బావ వచ్చాడు. అంతా విని అత్తయ్యమీద మండి పడ్డాడు.

"ఇటువంటి విషయాలలో, ఒకరి ముందు చేయి జాచి, లేదనిపించుకోవలసిన గతి నీకే మొచ్చిందమ్మా! నాకు పెళ్లి చేసుకోవాలనుంటే పద్మ తప్ప ఇంకో పిల్లే దొరకదా?" అని విసు క్కొన్నాడు బావ.

అంతటితో ఆ ప్రస్తావన ఆగిపోయింది. మరునాడు అత్తయ్య, బావ వెళ్లిపోయారు.

* * * *

కాలగర్భంలో రెండేళ్లు కరగిపోయాయి. అన్నయ్య అతికష్టంమీద నాకొక సంబంధం తెచ్చాడు.

"ఈడు జోడు కుదరాలంటావు. పద్మకి అన్నివిధాలా తగిన వరుని తెచ్చేను చూసేవా అమ్మా! శంకరం చెప్పవాడు. ఆస్తిపాస్తు లున్నవాడు. నిజంగా ఈ సంబంధం కుదిరిం

**(తరువాయి 56 వ పేజీలో)**

సదా దేశరక్షణకు
సన్నద్ధులై ఉండండి

నాకాస్
నేటినుండి ఉబ్బసముతో బాధపడ నవసరం లేదు. ఈ వ్యాధి నిర్మూలనకుగాను పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేద ఔషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.
8 ఔ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకం.
ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

నారసింహ లేహ్యం
శ్లేష్మమయినది — మేహము, నిస్సాక్తత, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలము రక్తవృద్ధి కలిగించును. 20 తు. రు. 3—50
రోజాపుష్ప లేహ్యము
అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. రు. 1—25, పోస్టేజి ప్రత్యేకం. క్యాటలాగు ఉచితం. పి. సి. ఏ. అండ్ కో., ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.

శ్రీ యోగాశ్రమము
పెదవాల్తేరు
విశాఖపట్టణము-3.
☞ డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్సచేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము,సంతానములేని వారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.
వివరములు తెలియగోరువారు ఒక రూపాయి పంపవలయును

దంటే, పద్మ అదృష్టమే అనుకో'' అన్నాడు.

అక్కయ్య సంబంధంతో పోల్చి చూస్తే, ఇది అన్నివిధాల మంచి సంబంధమే అనుకోవాలి. భగవంతునికి నాపై ఆమాత్రం దయ కల్గినందుకు సంతోషించాను.

అంతకన్న పెద్ద ఆశలు పెట్టుకొని పరుగులు పెట్టేందుకు తమ తాహతు చాలదని అమ్మకూడ తల ఊపింది.

పెళ్లి నిరాడంబరంగా జరిగిపోయేందుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ముహూర్తం వారంరోజు లుండవగా నాకొక ఉత్తరం వచ్చింది. నాకు ఉత్తరాలు వ్రాసే వారు ఎవరా అని ఆశ్చర్యపోయాను. అదే జీవితంలో నేనందుకొన్న మొదటి ఉత్తరం. గుండెలు గబగబ కొట్టుకొన్నాయి. ఏదో కాని పని చేస్తున్నట్లు నాలుగు వైపులా బెదరుగా చూశాను. ఎవరూ చూడలేదన్న ధీమాతో ఉత్తరం తెరిచాను. లేతగులాబి రంగు కాగితం మీద, చక్కని ముత్యాల కోవల్లా ఉన్న అక్షర పంక్తులు నా కళ్ల నాకరించేయి.

''ప్రియమైన పద్మా!''

గుండె అమిత వేగంతో కొట్టుకోసాగింది. నన్ను ప్రియమైన పద్మా! అని సంబోధించే ఈ వ్యక్తి ఎవరు? నన్ను ప్రేమించేవారు, ఈ లోకంలో అమ్మకాక, ఇంకొకరుకూడ ఉన్నారా?

ఎవరా అమృతమూర్తి? ఎడారిలో దప్పికతో నోట తడారి తపించుతున్న పాంథుని నోటికి అమృత సదృశమయిన చల్లని పానీయం అందింప జూచిన ఈ మహనీయుడెవరు?

నా ఆత్రుతను ఆపుకోలేక రెండు, మూడు పేజీలను గబగబ తిప్పి ఆఖరినున్న హస్తాక్షరాలను చూశాను. ఒక్కసారి నా హృదయం ఆనందంతో ఎగిరి గంతేసింది. మనోవిహంగం అనంతాకాశంలో పల్టీలు కొడుతూ, వాయువేగంతో పయనించింది. ఎక్కడికి? బావ దగ్గరికా?

# ఆఖరి అడుగు

( 7 వ పేజీ తరువాయి)

బావ ... ఆ రెండు అక్షరాలు తనకానాడు ఎంత ఆనందాన్ని, ఆత్మీయతను మోసుకొచ్చాయని!

''నీ వివాహం సంగతి విన్నాను పద్మా! శంకరం నా చిన్ననాటి స్నేహితుడు. అతడి గురించి నాకు తెలిసినంతగా, ఎవరికీ తెలియదు. శంకరం ఎలాటివాడో తెలిసికూడ, అతనితో నీ వివాహాన్ని ఆమోదించలేకపోయేను.

''శంకరానికి డబ్బు, చదువు, వయస్సు అన్నీ ఉన్నమాట నిజమే; కాని ప్రతి స్త్రీ వాంఛించే ప్రేమ, హృదయం వాడిదగ్గర లేవు. ఆడది అంటే, కేవలం పురుషుని వినోదార్థం సృష్టింపబడ్డ విలాసవస్తువు అంటాడు.

''అజ్ఞానులయిన చిన్నపిల్లలే ఎల్లకాలం ఒక బొమ్మతో ఆడరు. ఆనందం అందుబాటులో ఉన్న మనం ఒక్క ఆడదానితో ఎందుకు తృప్తిపడాలంటాడు. లభ్యమయిన ప్రతి స్త్రీని అందుకొని అనుభవించిన ఘనుడు శంకరం. ఆ బుద్ధి వాడి రక్తంలో ఎంతగా జీర్ణించిందంటే ఆడది అంటే ఇంకో భావనే వాడి మనసులోకి రాదు.

''ఈ వివాహం జరిగినా వాడి బుద్ధి మారుతుందనుకోను. తుచ్ఛసుఖాల కాశపడి ఇల్లు, ఒళ్లు గుల్లచేసుకొన్న మూర్ఖుడు. ప్రపంచంలో ఉన్న ...

''ఇప్పుడదంతా ఎందుకులే ... ఇదంతా బావ తన స్వార్థంకోసం పన్నిన పన్నాగం అనుకోకు. నువ్వు నా కోరికను మన్నించు, మన్నించకపో; అది నీ యిష్టం ... నిన్ను నా స్వార్థానికై బలి చేయ సంకల్పించేటంత అధముడిని కాను పద్మా.

''ఎక్కడయినా సరే, నువ్వు సుఖంగా, ఆనందంగా ఉండడమే నే కోరేది. నన్ను అపార్థం చేసుకోవని తలుస్తాను.

''నువ్వు నన్ను మనస్ఫూర్తిగా పెళ్లాడుతానంటే, నిన్ను పువ్వులలోపెట్టి పూజిస్తాను. నీకు ఏ లోటూ రాకుండా నా శక్తినంతా వినియోగించి సుఖపెడతాను. ఇదంతా పెళ్లిముందు ప్రమాణాలని తోసిపారేయకు పద్మా.

''ఆనాడు 'పద్మ కాకుంటే ఇంకో పిల్ల. నాకు పెళ్లి చేసుకోవాలనుంటే పిల్లే దొరక్కపోయిందా?' అన్నాను.

''నాకు కావలసింది నువ్వేనని ఆనాడు తెలుసుకోలేకపోయాను. నా హృదయంలో, నా ఆలోచనలలో, నా కవితలో, నా కథలలో; ఎటు చూసినా నీ రూపమే. ఎక్కడ విన్నా నీ పలుకులే ప్రతిధ్వనిస్తుంటే, నువ్వే ... నా స్వప్నసుందరివని తెలుసుకొనేసరికి వేళ మించిపోయిందా? పవిత్ర ప్రేమకు దేశ కాల పరిస్థితులు అడ్డు పడగలవా పద్మా!

''నీ మనోనిశ్చయం స్పష్టపరచిననాడు, గాలిలో పయనించి నీ చరణాలముందు వాలుతాను. నా ఆశాలతను తుంచి, ముక్కలు చేసేటంత కఠిన హృదయం నీకు లేదని నాకు తెలుసు. నా నమ్మకాన్ని వమ్ముచేయకు పద్మా!

''ఈనాడు నీ జీవితనౌక చుక్కాని నీ చేతుల్లో ఉంది. దానిని ఏ వంక తిప్పుతావో? నీవు ఏరి కోరి, ఏ బాట పయనించినా, అది కుసుమ సదృశమై, మనోజ్ఞమై, మనసును అలరించే మధురగానమై, నీకు అలౌకికానందాన్ని అందించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను.''

''పద్మా! పద్మా!'' అన్న అన్నయ్య పిలుపుతో ఆ అనురాగ వల్లరిని హృదయంలో పదిలపరచుకొని, పరుగు తీశాను.

''ఆ పెరటి గుమ్మాన పడిగాపులు పడవద్దని ఎన్నిసార్లు చెప్పేను. కాలం బాగులేదు. ఏనాటి కెవరి కే బుద్ధులు పుట్టేనో! ఈ వారం గడచి ఆ మూడుముళ్లు పడ్డాక నీ ఇష్టంవచ్చినట్లు తిరుగు, నాకేం బాధ లేదు'' అని కోపగించుకొన్నాడు అన్నయ్య.

* * *


జీవితంలో ఏ చిన్న కోర్కెను భగవంతుడు నాకు మంజూరు చేయలేదని మొదటనే చెప్పాము కదూ! బావతో నా పెళ్లి జరుగలేదని వేరుగా చెప్పాలా?


నా ఉత్తరం అందుకొన్న బావ, రెక్కలు కట్టుకు వాలలేదు. కనీసం కాలినడకనైనా వచ్చేందుకు ప్రయత్నించలేదు. కళలంటే చెవి కోసుకొనే ఒక ధనవంతుల ఇంటి పిల్ల పెద్ద కట్నంతో వస్తుంటే, తన భావనాసుందరిని చెరిపి, ఇంకొక మూర్తిని సృష్టించడానికి బావ కేమంత కష్టమయిన పనిగా తోచలేదు. 'సిరి రా మోకాలొడ్డేటంత' తెలివి తక్కువ వాడు కాడు బావ.

శంకరంతో వివాహం జరిగిన తరువాత

పగలు సెగలు

ఫోటో—ఎస్. ఎన్. పెండ్యాం (తణుకు)





సాంచీస్తూపం

ఫోటో—గణపతి కోటేశ్వరరావు (ఖరగ్‌పూర్)

నేను అనుభవించినది స్వర్గమో, నరకమో; అప్పటి నా సుఖదుఃఖానుభూతులతో మిమ్ములను విసిగించదలచలేదు. ఆ స్వర్గ నరకాల మధ్యగానున్న మర్త్యలోకంలో, భారత దేశంలోనే నా జీవితం గడచిందనిమాత్రం చెప్ప గలను.

ఈ పవిత్ర భారతదేశంలో వేదాలలోను, పురాణాలలోను స్త్రీకి అత్యంత గౌరవమర్యాదలు పవిత్రస్థానం ఇస్తున్న మన హిందూ సమాజంలో అనేకమంది స్త్రీలకి ఎట్టి సుఖ సంతోషాలు లభ్యమవుతున్నాయో వాటిని, నేను పొంద గలిగాను.

• • •

ఎండ వాటారింది. యౌవన జీవితపు కోర్కెల వేడిమి తగ్గింది. బేంకులో డబ్బూ, బంగారం పండే పొలాలు ఏనాడో పలాయనం చిత్తగించగా, మిగిలిన ఇల్లు అప్పులవాళ్ల చేతుల్లో పడింది. ఇంటిలోని విలువయిన సామానులు అంతకుముందే కాలు కదిపేయి. ఇంక మిగిలింది నేను, శంకరం, నలుగురు పిల్లలు.

అలాటి పరిస్థితిలో ఒక్కసారిగా శంకరానికి జ్ఞానోదయం కలిగింది. "పద్దాలు, పద్దాలు, నిన్ను చాల కష్టపెట్టేనే; ఇంక దాని ముఖం చూస్తే ఒట్టు. నువ్వు ఎలా ఉండమంటే అలా తిరుగుతాను, నీతోడు ... పద్దాలు" అంటూ తన ప్రేమ వెళ్లబోసేడు శంకరం.

ఆ మాట విని నేను ఎగిరి గంతేసేనంటే మీరు నమ్మరు; నేను వెయ్యలేదు కూడ. నిర్లిప్తతగా విన్నాను.

ఇవే మాటలు పది సంవత్సరాలకు ముందని ఉంటే ఏమయేదాన్నో! కాని, జీవిత సాంధ్య కాంతులు నల్లబారుతున్న తరుణంలో మదిలో ఆశలు, కదిలే నాడులు మూగవారి నిద్రించే వేళలో శంకరం నామాట వింటే నాకేం కావాలి? కన్ను మూసినా, కన్ను తెరచినా, గతించిన గాథలు, బాధలు మొరటు దయ్యాలలా, నా చుట్టూ పరిభ్రమిస్తూ, అవహేళన చేస్తూంటే నేను కోరేదేమిటి?

ఆశ అన్నది మహా జాడ్యం. ఏమాత్రం అవకాశం కన్పించినా అది మనిషిని ఇట్టే వశ పరచుకొని, రాత్రనక, పగలనక పీడిస్తూం టుంది. ప్రతి చిన్న అవకాశం ఆ ఆశాలతకు దోహదం చేయడానికే అన్నట్లు అనిపిస్తుంది. దాని వశీకరణకు లోనయిన మనిషికి విశ్రాంతి అన్నది ఉండదు. అన్నివేళలా దాని తలంపే; అన్ని చోట్లా దాని పిలుపే.

కాలం గడుస్తున్నకొద్దీ అలాటి జాడ్యమే నాలో అంకురించింది. ఈ సంసార జంజాటన నుండి దూరంగా పోయి, ఈ బాధలకు, భ్రాంతులకు అతీతంగా ప్రశాంత జీవితం గడపాలని, పుట్టినప్పటినుండి దెబ్బపై దెబ్బతిన్న నాలాటి జీవి, ఆఖరి గడియలలో అపాటి ప్రశాంతత ఆశించిందంటే అందులో అత్యాశ లేదనుకొంటాను.

శంకరంలో వచ్చిన మార్పు ఈ ఆశాలతకు కొంత దోహదం చేసింది. దేశం నలుమూలలా తిరిగి పుణ్యక్షేత్రాలను సందర్శించాలన్న కోర్కె నాలో బలపడసాగింది. ఏ పని చేస్తున్నా, ఏ మాట వింటున్నా అదే ధ్యాస. కాశీవిశ్వనాథుని దర్శిస్తున్నట్లు, రామలింగేశ్వరుని దర్శనార్థం సముద్రంలో స్నానం చేస్తున్నట్లు కలలుగని మురిసిపోయేదాన్ని. కాలం గడుస్తున్నకొద్దీ, ఆ రోజు దగ్గరకు వస్తున్నకొద్దీ, నా మనసు పరవశంతో పరుగులు పెట్టేది.

అంతలోనే నిరుత్సాహం — ఇంత సొమ్ము ఎక్కడినుంచి వస్తుంది? ఏ దేముడు ఇస్తాడు? చిల్లరడబ్బులతో హుండి నిండిపోయింది. ఎన్నిమారులు లెక్కపెట్టినా ఏభై రూపాయలకి దాటందే ... ఈ సొమ్ముతో ఏమి చూడగలను. ఏమి చేయగలను. అదే చింత!

ఆనాడు శనివారం. వెంకటరమణుని పూజ ముగించి పైకి వచ్చేసరికి శంకరం నవ్వుముఖం కన్పించింది.

"పద్దాలు! తీర్థయాత్రలకు మూట, ముల్లె కట్టుకో ... డబ్బు సిద్ధమయింది" అన్నాడు.

నా చెవులని నేను నమ్మలేకపోయాను. ఇంత సొమ్ము ఎక్కడినుంచి వచ్చినట్లు?

ఆయన బాగా ఉన్న రోజులలో, ఎవరో స్నేహితుడు అప్పుగా తీసుకొన్న సొమ్ము, ఇన్నాళ్ళు తీర్చలేక, మంచిరోజులు రాగా ఇప్పుడు తీర్చివేసేడట.

"తిరుపతి వెంకటరమణా! తండ్రీ! నువ్వే ఆ స్నేహితుడి రూపంలో వచ్చి ఇచ్చేవు" అనుకొన్నాను.

వారం రోజులలో ప్రయాణానికి మంచి రోజు కుదిరింది. ప్రయాణ సన్నాహాలలో ఉన్న నాకు కాలగమనమే తెలియలేదు. నా కాయం ఇంటిలో ఉన్నా, మనస్సు అన్ని క్షేత్రాలూ చూసి వస్తున్నది.

మరునాడే ప్రయాణం. ఉదయం పూజ ముగించుకొని, దేవుని సింహాసనం వెనుక ఉంచిన సొమ్ము పదిలంగా ఉందో, లేదో చూడడం, ఈ వారం రోజులై అలవాటయింది.

ఆనాడు సొమ్ము ఉండే చోటు కాళీగా వెల వెల పోతున్నది. నా గుండె ఆగినంతపని అయింది. నా ఆశ మొదటికే నరికివేయబడింది. ఎంత విచారించినా, ఎంత రోదించినా ఫలితం శూన్యం.

"అన్నయ్య తత్వం తెలిసి, అలా అశ్రద్ధగా ఎందుకు పెట్టావమ్మా?" అంటాడు శీను.

"తను పెద్ద కొడుకు, ముద్దుల కొడుకు కనుక, కన్నంలో తేలు కుట్టిన దొంగల్లా ఊరుకొన్నారు. ఇంకెవరికయినా ఒక్క కాని ఇయ్యడానికి గింజుకుంటారు" అని తన అక్కసు వెళ్లబోసుకొన్నది చిన్న కోడలు.

"ఇంతకీ ప్రాప్తం ఉండాలి" అంటుంది పొరుగింటి పుల్లమ్మ. ఈ జీవితం ఏదిమాత్రం అనుకొన్న విధంగా అయిందా? ఇదీ అంతే ... ఎడారిలో పాంథునికి కనిపించే ఎండమావుల్లా, ఆశించిన ప్రతి కోరిక, దూర దూరంగా కన్పిస్తూ, ఊరిస్తూ, దరి చేరబోతే దగా చేశాయి. అతి జాగ్రత్తగా వేయబోయే ఆఖరి అడుగుకూడ అడుసులోనే పడింది. ఇంక ఈ "ఊబి" లో నుంచి ఆ భగవంతుడే పైకి లాగాలి.

• • •

"నాన్నమ్మా! వంటయిందా అని తాతయ్య అడుగుతున్నారు" అంటూ చిట్టి వచ్చాడు.

"ఆఁ ... అయిపోవచ్చింది" అంటూ ఏనాడో ఆరిపోయిన పొయ్యిలో, బుర్రలోని కిరసనాయిలు పోసి, మంట ఎగదోసింది పద్దమ్మ. ★